వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 274
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
ఆగస్టు 05, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ అమలెప్పుడూ ?

- పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ కడియం కావ్య
- భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలి

# అరెస్టు తప్పదా?



వివరాలు 2లో..

- కాళేశ్వరం నివేదికతో కాంగ్రెస్ పావులు
- కేసీఆర్ పై బిగిస్తున్న ఉచ్చు?
- కీలక నేతల అరెస్ట్ కు రంగం సిద్ధం?
- బీఆర్ఎస్ కు వరుస కష్టాలు

తెలంగాణలో రాజకీయాలు కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికతో మరింత రసవత్తరంగా మారాయి. జస్టిస్ పి.సి. ఘోష్ నేతృత్వంలోని కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై రూపొందించిన నివేదికకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పరిణామంతో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావుతో పాటు ఇతర కీలక నేతల అరెస్టులు ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీకి ఈ పరిణామం మరింత గందరగోళాన్ని సృష్టించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నివేదికను ఆగస్టు 15 తర్వాత జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పెట్టి, తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయం మరింత రసవత్తరంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చేపట్టే చర్యలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి, వరంగల్



8లో..

## కాళేశ్వరం తెలంగాణ జీవధార

- ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు వినయ్ భాస్కర్

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



8లో..



## చెత్త తరలింపు వాహనాలు ఐసీసీసీకి అనుసంధానం చేయాలి

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

# అరెస్ట్ తప్పదా..?

- కాళేశ్వరం నివేదికతో కాంగ్రెస్ పావులు
- కేసీఆర్ పై బిగిస్తున్న ఉచ్చు?
- కీలక నేతల అరెస్ట్ కు రంగం సిద్ధం?
- బీఆర్ఎస్ కు వరుస కష్టాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణలో రాజకీయాలు కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికతో మరింత రసవత్తరంగా మారాయి. జస్టిస్ పి.సి. ఘోష్ నేతృత్వంలోని కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై రూపొందించిన నివేదికకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పరిణామంతో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావుతో పాటు ఇతర కీలక నేతల అరెస్టులు ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీకి ఈ పరిణామం మరింత గందరగోళాన్ని సృష్టించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నివేదికను ఆగస్టు 15 తర్వాత జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పెట్టి, తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయం మరింత రసవత్తరంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చేపట్టే చర్యలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం సమయంలోనే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో ఒక కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు నివేదిక, దాని పర్యవసానాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ, కాళేశ్వరం నివేదిక ఆధారంగా కొంతమంది బీఆర్ఎస్ నాయకుల అరెస్టులు ఉండవచ్చని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అయితే, దీని వల్ల పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని, నాయకులందరూ ధైర్యంగా ఉండాలని ఆయన భరోసా ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన నివేదిక ఊహించిందేనని, ఈ ప్రాజెక్టు పనికి రాదని చెప్పేవారు అజ్ఞానులని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అయితే కేసీఆర్ మాటలను బట్టి చూస్తే ఆయన అరెస్ట్ జరుగుతుందని ప్రచారానికి బలం చేకూరుస్తోంది.

## కాళేశ్వరంపై ప్రభుత్వం దూకుడు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు 2023 అక్టోబర్‌లో కుంగిపోయాయి. ఈ ఘటన అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో, రేవంత్ రెడ్డి సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టులోని అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు 15 నెలల విచారణ అనంతరం, జులై 31న ఈ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించేందుకు ప్రభుత్వం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ నివేదికపై చర్చించిన తర్వాత, సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. లక్షల కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కర్మ, కర్త, క్రియ అన్నీ కేసీఆర్ అని పరోక్షంగా పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీ అగ్రనేతలతో ఆరు గంటలపాటు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. ప్రభుత్వ చర్యలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

## బీఆర్ఎస్ కు వరుస కష్టాలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీకి కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పదేళ్ల అధికార పీఠాన్ని కోల్పోవడం, అధినేత కేసీఆర్ అనారోగ్యం, పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం, పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారడం వంటి వరుస ఎదురుదెబ్బలతో పార్టీ తీవ్ర గందరగోళంలో పడింది. ఈ కష్టాలకు తోడు, పార్టీలోని కీలక నాయకుల మధ్య విభేదాలు బయటపడటం మరింత తలనొప్పిగా మారింది. ఎమ్మెల్సీ కవిత వ్యవహారం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె వరుస ఇంటర్వ్యూలలో పార్టీలోని కీలక నేతలపై పరోక్షంగా వ్యాఖ్యలు చేయడం, దీనిపై అగ్ర నాయకులు ఎవరూ స్పందించకపోవడం పార్టీకి మరింత నష్టం కలిగిస్తోంది. పార్టీలో కేసీఆర్ నాయకత్వం తప్ప మరొకరిది ఆయన స్థాయి కాదంటూ కవిత చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించినవేనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా, కవిత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మధ్య జరిగిన వాదోపవాదాలు పార్టీలో అంతర్గత గొడవలను మరింత బయటపెట్టాయి. ఒకరిపై ఒకరు పరోక్షంగా విమర్శలు చేసుకోవడం, పార్టీలో గ్రూపు రాజకీయాలు పెరిగాయని స్పష్టం చేస్తోంది. ఈ పరిణామాలు పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## రాజకీయంగా ఇబ్బందులు ..

కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన పీసీ ఘోష్ కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టుపై సమర్పించిన నివేదిక బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తోంది. ఈ నివేదిక ఆధారంగా పార్టీలోని ముఖ్య నేతలు అరెస్ట్ అయ్యే అవకాశం ఉందని స్వయంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆరే వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కేసీఆర్‌తో పాటు హరీష్ రావు వంటి కీలక నాయకులు అరెస్ట్ అయితే పార్టీ మరింత ఇరకాటంలో పడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఈ నివేదికపై ఉభయ సభల్లో చర్చిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదు. ఇప్పుడు ఈ కీలక చర్చలో ఆయన పాల్గొని సమాధానం చెప్పకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో, కాళేశ్వరం నివేదికపై జరిగే చర్చకు కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా లేదా అనేది ఉత్కంఠగా మారింది.




## బీఆర్ఎస్ ను వీడుతున్న నేతలు..

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ కూడా బీఆర్ఎస్ నాయకులను తమ పార్టీల్లోకి ఆకర్షిస్తోంది. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు పార్టీని వీడుతుండటం బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బగా మారింది. తాజాగా, పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారగా, ఇప్పుడు అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేశారు. అలాగే గువ్వల బాలరాజుతో పాటు మరికొంతమంది మాజీ ఎమ్మెల్యేలు కూడా కాషాయ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. పార్లమెంటు ఎన్నికల తర్వాత కాస్త నిశ్శబ్దంగా ఉన్న బీజేపీ, కొత్త అధ్యక్షుడితో మళ్లీ దూకుడు పెంచింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి రావాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ, మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలను తమ వైపు తిప్పుకోవడంపై దృష్టి పెట్టింది. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మారుస్తాయని భావిస్తున్నారు.

తెలంగాణలో బీజేపీ దూకుడు పెంచింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలను చేర్చుకునే అవకాశం తక్కువగా ఉన్నందున, ప్రధానంగా బీఆర్ఎస్‌లోని కీలక నేతలపైనే ఆ పార్టీ దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. ఈ రాజీనామా పర్వాన్ని బీఆర్ఎస్ సమర్థవంతంగా అడ్డుకోకపోతే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ కష్టాలకు తోడు, బీఆర్ఎస్ బీజేపీలో విలీనం కానుందనే ప్రచారాన్ని కూడా పార్టీ తిప్పికొట్టలేకపోతోంది. ఎమ్మెల్సీ కవితతో పాటు, ఏపీ బీజేపీ ఎంపీ సీఎం రమేష్ వంటి వారు ఈ విలీనంపై ఆరోపణలు చేయడం పార్టీని మరింత ఇరకాటంలో పడేసింది. ప్రస్తుతం బీఆర్ఎస్ ముందు మూడు ప్రధాన సవాళ్లు ఉన్నాయి. పార్టీలో అంతర్గత గందరగోళానికి కారణమవుతున్న కవిత సమస్యను పరిష్కరించుకోవడం. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన నివేదికను న్యాయపరంగా సమర్థవంతంగా ఎదుర్కొని నిలబడటం. బీజేపీ చేపట్టిన 'ఆపరేషన్ ఆకర్ష్'కు అడ్డుకట్ట వేయడం. ఈ సవాళ్లను బీఆర్ఎస్ ఎలా అధిగమిస్తుందో, పార్టీ భవిష్యత్తును ఎలా కాపాడుకుంటుందో వేచి చూడాలి.

## లాదెళ్లలో పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం



**వరంగల్ వాయిస్, దామెర:** దామెర మండలం లాదెళ్ల గ్రామంలోని బస్టాండ్ వద్ద శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలు, ఉత్సాహంతో మొదటి రోజు వేడుకలను నిర్వహించారు. మొదటి రోజు గ్రామ తోరణాన్ని అందంగా అలంకరించారు. అమ్మవారికి ఆహ్వానం పలికి, ప్రత్యేక పూజలతో ఆరాధించారు. పంచామృతాభిషేకంతో అమ్మవారికి అభిషేక సేవలు నిర్వహించారు. శోభాయాత్రలో అమ్మవారు దర్శనమిచ్చారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, దాన్యాధివాసం, హోమ పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ ఉత్సవంలో మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. కొలనుపాక వీర మల్లయ్య, రవీంద్ర చారి, అనిల్ శాస్త్రి, సుధాకర్, అఖిల్ శాస్త్రి వంటి వేద పండితుల ఆధ్వర్యంలో యాగశాల పూజలు నిష్ఠతో కొనసాగాయి. ఈ కార్యక్రమంలో కరుగుత రమేష్, అంబటి రాజు, డెంగు నవీన్, గునిగంటి రమేష్, సింధే శ్రీనివాస్, మదసు రమేష్, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం అమ్మవారి ప్రతిష్ఠాపన, బోనాల మహోత్సవం నిర్వహించనున్నారు. గ్రామస్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

**◆ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్**

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో "ఇంటింటికి బీజేపీ – ప్రతి గడప గడపకి బూత్ అధ్యక్షుడు" పేరుతో 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ ఇంటింటికి వెళ్లి, 'గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం' అనే నినాదంతో మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను 'దొందూ దొందే' అని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతికి కంచుకోట అని, బీఆర్ఎస్ అవినీతిపై కట్టిన కోట అని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసిందని, పదవీకాలం ముగిసినా పెండింగ్ బిల్లుల కోసం సర్పంచులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు, అసంపూర్ణ ధాన్యం సేకరణ, కౌలు రైతులకు భరోసా లేకపోవడం వల్ల అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని ఆయన తెలిపారు. అలాగే, రూ. 2500 ఆర్థిక సాయం, ఉచిత స్కూటీలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం కోసం ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారని, గ్రామీణ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. గాంధీ ఆశయాలు నెరవేరాలన్నా,



మోదీ సంకల్పం సాకారం కావాలన్నా అంకితభావం, చిత్తశుద్ధి ఉన్న నాయకుడు ఉండాలని, అలాంటి వారినే బీజేపీ ప్రోత్సహిస్తుందని గంట రవికుమార్ అన్నారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి, మీ గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పట్టపురం ఏకాంతం గౌడ్, మండల ఇన్‌చార్జ్ రేసు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి జాటోత్ రవి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గొల్లపల్లి సంతోష్ కుమార్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గోనె సంపత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు చీమల చంద్రయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బాదావత్ మారుతి, బూత్ అధ్యక్షులు నవీన్, భాస్కర్, వెంకన్న, కుమారస్వామి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు తాటికాల నరసయ్య, సీనియర్ నాయకులు భోగ సుధాకర్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్లిం ఉద్యోగుల మానవతకు 'సలాం'

**◆ తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం**





**వరంగల్ వాయిస్, వరంగల్:** మానవత్వానికి ప్రతీకగా నిలిచారు తెలంగాణ ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం చేసి పెద్ద మనసు చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే వరంగల్‌కు చెందిన ఖాజా రఫీక్ వైద్య శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ ముస్లిం ఉద్యోగులు తక్షణమే స్పందించి రూ. 1,40,000 ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. తోటి ముస్లిం ఉద్యోగులు అనారోగ్యంతో చనిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారికి శాశ్వత పరిష్కారం చూపాలని భూపాలపల్లి జిల్లా డిప్యూటీ తహసీల్దార్ షఫీ సర్కార్ ఆలోచించారు. ఈ ఆలోచనను వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్, ఇంటెలిజెన్స్ శాఖ డీఏవో మాశూక్ పాషాలతో పంచుకున్నారు. ముగ్గురూ కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వాట్సాప్ ద్వారా "తెలంగాణ



ముస్లిం ఉద్యోగుల సంక్షేమ సంఘం" అనే గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. మొదట 2500 మందితో రెండు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, వారిలో 600 మందితో "ముస్లిం ఉద్యోగుల సొసైటీ"గా ఒక గ్రూప్‌ను రూపొందించారు. ఈ గ్రూప్ ఏర్పాటు తర్వాత, ఖాజా రఫీక్ మరణవార్త తెలుసుకున్న సభ్యులు, తమకు తోచినంత సహాయం చేసి రూ. 1,40,000 సేకరించారు. ఆ మొత్తాన్ని వరంగల్‌లోని ఆయన కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలంగాణ ముస్లిం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీజీటీఏ రాష్ట్ర సహాధ్యక్షుడు, వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. ఆర్థిక సాయంతో పాటు, ప్రభుత్వ ప్రయోజనాలు, ఒకరికి పెన్షన్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఒక్క పిలుపుతో ఇంతమంది స్పందించడం, తోటివారికి సహాయం చేయడానికి ముందుకు రావడం ప్రశంసనీయం.

# విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వ పరం చేయాలి

- **ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎఫ్‌డీవై డిమాండ్**
- **రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ**

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఏఐఎఫ్‌డీఎస్ (ఆల్ ఇండియా ఫోరం ఫర్ డెమోక్రటిక్ స్టూడెంట్స్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎఫ్‌డీవై (ఆల్ ఇండియా ఫోరం ఫర్ డెమోక్రటిక్ యూత్) రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 12న హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ గారి శతజయంతి వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 12న హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.ప్రభుత్వాలు ఇప్పటికీ కార్పొరేట్ విద్యా, వైద్య సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగాలపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రులు, మంత్రులే




కార్పొరేట్ కళాశాలలను ప్రారంభిస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎలా గౌరవిస్తున్నారో యువత ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఈ పరిస్థితిని మార్చడానికి విద్య, వైద్యంతో పాటు అన్ని వర్గాల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని యువజన, విద్యార్థి సంఘాలను కోరారు. తక్షణమే విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, హనుమకొండ జిల్లా కార్యదర్శి నీల రవీందర్, యువజన విద్యార్థి నాయకులు పరిమళ గోవర్ధన్, ఐతమ్ నగేష్, పోలబోయిన రాజు, గాదె ప్రణయ్, కునుర్ రాజేందర్, కర్ర సీతారాం రెడ్డి, చీపురు ఓధయ్య తదితరులు పాల్గొన్నారు.

# రహదారిపై చెత్త



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చెత్తను డంపింగ్ యార్డులో కాకుండా రహదారిపై వేయడాన్ని నిరసిస్తూ గాంధీపురం గ్రామ శివారులో రైతులు ఆందోళనకు దిగారు. చెత్త ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, మున్సిపాలిటీ అధికారులు ప్రతిరోజు దాదాపు రెండు కిలోమీటర్ల మేర రహదారిపైనే చెత్తను వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వేలాది కోతులు చెత్త కుప్పల వద్దకు చేరి ప్రజలను భయపెడుతున్నాయని, దుర్వాసన కారణంగా తమ వ్యవసాయ భూములకు వెళ్లలేకపోతున్నామని చెప్పారు. పొలాల్లో పనిచేయడానికి కూలీలు కూడా రావడం లేదని, దీనివల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఈ సమస్యను గతంలోనే మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు తెలిపారు. వెంటనే రహదారిపై వేసిన చెత్తను తొలగించి, భవిష్యత్తులో డంపింగ్ యార్డులోనే చెత్త వేసేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** నగరంలోని ప్రముఖ కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న రావి, వేప చెట్ల మధ్య లక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ ఈవో ఎన్. వెంకట్రావు, రంగనాథ స్వామి ఆలయ మాజీ అధ్యక్షుడు వంగరి రవి, ఆలయ అర్చకులు గుండేటి రజనీకాంత్, పెద్దూరు శ్రీనివాస్, మార్త సందీప్, అంకం కల్యాణ్, భక్తులు కూరపాటి రోజా, శ్రీరాముల పెద్దన్న, పుష్పలీల, చిలుపూరి రజిని, వసంతరావు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

# గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రాష్ట్ర బీజేపీ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు డోర్నకల్ మండల కేంద్రంలోని గొల్లచెర్ల గ్రామంలో 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని డోర్నకల్ మండల అధ్యక్షుడు బానోతు గణేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో సాధించిన విజయాలను వివరించారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కౌన్సిలర్ వ్యాస్ లక్ష్మీనారాయణ, బండ్ల విజయ్, ఉడుగుల శ్రీనివాస్, తోట అప్పారావు, వెంకన్న, మండల కార్యదర్శి హనుమంతు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నన్నపునేని నరేందర్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యుడు నన్నపనేని నరేందర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 28వ డివిజన్‌లోని బీట్ బజార్ ఆటో అడ్డాలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టీ. రమేష్ బాబు, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అప్పరాజు రాజు, స్థానిక టీఆర్ఎస్ నాయకులు ముగ్గులగాని సంతోష్, సముద్రాల రాంబాబు, బైరి అఖిల్, పెద్దపల్లి కృష్ణ, రమేష్ కొండ, ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు అన్నదానం చేశారు.

# సీఆర్ఐ పంప్స్ షోరూం ప్రారంభం



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండల కేంద్రంలో సీనియర్ జర్నలిస్ట్ మిట్టపల్లి ప్రభాకర్ కు చెందిన 'సీఆర్ఐ పంప్స్ షోరూం' ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, స్థానిక సీఐ హరికృష్ణ, డైరెక్టర్ సముద్రాల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్ల శోభన్, మరియు సీఆర్ఐ పంప్స్ ప్రతినిధులు హాజరయ్యారు. అతిథులు రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు.

# విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం సిగ్గుచేటు




**వరంగల్ వాయిస్, జగిత్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా రాష్ట్రానికి ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించలేదని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్బీ) రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ ఆరోపించారు. జగిత్యాలలో ఏఐఎస్బీ జిల్లా ప్రథమ మహాసభ జిల్లా కన్వీనర్ ఏడపెల్లి వంశీ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన హకీమ్ నవీద్, విద్యారంగానికి ప్రత్యేక మంత్రి లేకపోవడం వల్ల అనేక సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు అందాల్సిన కాస్మెటిక్, మెస్ ఛార్జీల విడుదలలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మెటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్బీ డిమాండ్ చేసింది. ఈ మహాసభలో జగిత్యాల జిల్లాకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెట్టు రాకేష్, ప్రధాన కార్యదర్శిగా ఎడపల్లి వంశీ, ఉపాధ్యక్షులుగా అజిత్, మహేష్, సహాయ కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా దిలీప్, సురేష్, వెంకటేష్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు అతికం రాజశేఖర్ పాల్గొన్నారు.

# ఐక్యతతోనే పద్మశాలీల అభివృద్ధి

◆ అధ్యక్షుడు గాజుల సాంబయ్య నేత

◆ ప్రధాన కార్యదర్శి బాల్నే జగన్ నేత



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** అఖిల భారత పద్మశాలి సంఘం నర్సంపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. పట్టణ అధ్యక్షుడు గాజుల సాంబయ్య నేత అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి బాల్నే జగన్ నేత పర్యవేక్షణలో ద్వారకపేటలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ద్వారకపేటలోని కులబాంధవులు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరలో నర్సంపేట పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతామని అధ్యక్షుడు గాజుల సాంబయ్య నేత తెలిపారు. పట్టణ కమిటీని మరింత బలోపేతం చేస్తామని ప్రధాన కార్యదర్శి బాల్నే జగన్ నేత అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేస్తామని చెప్పారు. అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా సోషల్ మీడియా ఇంఛార్జ్ రాంపెల్లి లింగమూర్తి నేత మాట్లాడుతూ పట్టణంలోని కులబాంధవులు ఈ కార్యక్రమానికి చాలా చురుగ్గా స్పందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాసాని సుదర్శన్ నేత, బలభద్ర రవీందర్ నేత, పెండం భాస్కర్ నేత, ఆడెపు చంద్రశేఖర్ నేత, ఆడెపు రాజయ్య నేత, సమ్మయ్య నేత, బంక పరమేష్ నేత, తుమ్మ ఏకాంబ్రం నేత, జడల శ్రీను నేత, ఆడెపు రమేష్ నేత, మార్త రాజేందర్ నేత, గుల్లపెల్లి సుధాకర్ నేత, వెల్దండి మార్కండేయ నేత, వడిచర్ల సురేష్ నేత, బూర చెందర్ రావు నేత తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కేంద్రం నిర్లక్ష్యం

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా, దేశ రాజధాని ఢిల్లీలో బీసీల డిమాండ్లపై నిరసనలు, ధర్నాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా విమర్శించారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లును గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపి నెలలు గడుస్తున్నా, కేంద్రం మొద్దు నిద్రలో ఉందని ఆయన అన్నారు. బీసీ ప్రధానమంత్రిని అని చెప్పుకునే నరేంద్ర మోడీ, బీసీల డిమాండ్లను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభ, మండలిలో బిల్లులకు మద్దతు తెలిపి, కేంద్రంలో దానికి వ్యతిరేకంగా వ్యవహరించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వెంకట్రాములు అన్నారు. అధికారంలోకి వస్తే బీసీనే ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన బీజేపీ, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచే విషయంలో నాటకాలు ఆడుతోందని, దాని నిజస్వరూపం బయటపడుతోందని ఆరోపించారు. కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీగా ఉన్న అరవింద్‌తో పాటు మిగతా ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, రిజర్వేషన్ బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించకపోతే చరిత్రలో బీసీ ద్రోహులుగా మిగిలిపోతారని ఆయన హెచ్చరించారు. బీసీ డిమాండ్లపై ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యులు కూడా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు. బీసీల డిమాండ్లను కేంద్రం ఆమోదించే వరకు తమ పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# స్క్రాప్ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

## ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్క్రాప్ షాపుల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. మంగళవారం ఆయన స్క్రాప్ షాపు యజమానులతో సమావేశమై పలు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఐ శివకుమార్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా వాహనాలు, ఇనుము, ఎలక్ట్రానిక్ వస్తువులను అమ్మడానికి ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తింపు లేని వస్తువులను కొనుగోలు చేయకూడదని, రిజిస్టర్‌ను సరిగా నిర్వహించాలని హెచ్చరించారు. నిబంధనలు పాటించని షాపులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు కూడా అనుమానాస్పదంగా కనిపించే స్క్రాప్ షాపుల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కిషోర్, సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయం నిర్మాణంలో జాప్యం

■ మంత్రి కొండా సురేఖ జోక్యం చేసుకోవాలి

■ సీపీఐ ఎంఎల్ నేత రాచర్ల బాలరాజు




**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటికీ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కాకపోవడం శోచనీయమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు అన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కలెక్టర్ కార్యాలయాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు ప్రాంతంలో నగర అధ్యక్షుడు బండి కుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో బాలరాజు మాట్లాడారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసి పనిచేస్తుండగా, వరంగల్ జిల్లా కేంద్రంలో మాత్రం ఒక్క కార్యాలయం కూడా ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు దారితీస్తోందని ఆయన అన్నారు. నల్లబెల్లి, నెక్కొండ, రాయపర్తి వంటి దూర ప్రాంతాల గ్రామాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికీ హనుమకొండ జిల్లాలో ఉన్న వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాలరాజు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షుడు బన్న నర్సింగం, కార్యదర్శి ఎర్ర జయబాబుతో పాటు మహమ్మద్ ఖాన్, భాస్కర్, గంద్రతి హరిబాబు, వీరన్నతో పాటు పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరిస్తే గద్దె దింపుతాం

◆ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భాను ప్రసాద్

◆ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, ముల్కనూర్:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) భీమదేవరపల్లి మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం ముల్కనూర్ అంబేద్కర్ చర్చి వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భాను ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం రూ. 8,000 కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. "ప్రజా ప్రభుత్వం" అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యార్థులకు ఓట్లు లేవనే ఉద్దేశంతో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే స్థానిక ఎన్నికలలో విద్యార్థుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. విద్యా రంగ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు భీమదేవరపల్లి మండలం కార్యదర్శి కొండ చరణ్ అధ్యక్షులు నరికే పవన్ కుమార్,మండల సమితి సభ్యులు చిర్ర సాయి చంద్, పెండ్యాల బన్నీ, లోకిని బన్నీ, గండికోట సురేష్, శ్రీపతి రామ్ చరణ్, తాళ్ల సిద్ధార్థ, మడుగుల జోసెఫ్, చిదురాల సాయి గణేష్, సిద్ధార్థ, పెండ్యాల సుమంత్, అభిలాష్, వర్షిత్, విగ్నేష్, విశ్వతేజ, సాయి చిన్న, రామ్ చరణ్, కపిల్, ప్రసాద్, టేకుమట్ల అభి, గణేష్, విష్ణువర్ధన్, అభిరామ్ పాల్గొన్నారు.

# వికలాంగులకు వెంటనే రూ. 6016 పెన్షన్ ఇవ్వాలి

## సకినాల మల్లయ్య డిమాండ్



**వరంగల్ వాయిస్, చిట్యాల:** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని తెలంగాణ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు సకినాల మల్లయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు వికలాంగులకు రూ.6,016 పెన్షన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఆ హామీని పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ వైఖరి "ఒడ్డు దాటే దాకా ఓడ మల్లన్న, దాటాక బోడి మల్లన్న" అన్న చందంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనూ ప్రభుత్వం వికలాంగులను మోసం చేస్తోందని మల్లయ్య ఆరోపించారు. అసలైన హక్కుదారులకు కాకుండా, అధికార పార్టీ కార్యకర్తలకు ఇళ్లు ఇస్తున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ వెంటనే స్పందించి వికలాంగులకు ఇళ్లు, రూ. 6,016 పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అంతేకాకుండా, స్థానిక సంస్థల్లో వికలాంగులకు కనీసం 7 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే, వికలాంగులందరినీ ఏకతాటిపైకి తెచ్చి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# నడికూడలో తల్లిపాల వారోత్సవాలు

**వరంగల్ వాయిస్, నడికూడ:** హనుమకొండ జిల్లాలోని నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు ఒకటి, రెండు, మూడు, నాలుగులలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. ముఖ్యంగా, 9 నెలలు నిండిన గర్భిణులకు ముర్రుపాల విశిష్టత గురించి, 24 నెలల లోపు పిల్లల తల్లులకు తల్లిపాల ప్రాధాన్యత గురించి తెలియజేశారు. ఇంటింటికీ వెళ్లి తల్లిపాల గొప్పదనాన్ని వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి.సరిత, కె.సుప్రియ, బి.రజిని కుమారి, ఎం.లక్ష్మి, ఆయాలు రాధ, వనజ, ముత్యాలు, రమ, తల్లులు, పిల్లలు, ఆశ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి పవన్ డిమాండ్ చేశారు. మంగళవారం పవన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాను ఇష్టం వచ్చినట్లుగా విభజించిందని, దీనివల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను తిరిగి ఒకే జిల్లాగా ఏర్పాటు చేస్తే పరిపాలన సౌలభ్యం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి కేరాఫ్ అడ్రస్




**వరంగల్ వాయిస్, మహాదేవపూర్:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లేతకారి రాజబాబు తీవ్రంగా విమర్శించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ప్రాజెక్టులు నిర్మించడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయని, అన్నారం బ్యారేజీ పగిలిపోయిందని, కన్నేపల్లి పంపులు మునిగిపోయాయని ఆయన ధ్వజమెత్తారు. కేసీఆర్ జైలుకు వెళ్తాడనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు కాళేశ్వరంపై డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎవరిపైనా అక్రమ కేసులు పెట్టలేదని, బీఆర్ఎస్ నాయకుడు పుట్ట మధు ఎందుకు జైలుకు వెళ్లాడో అందరికీ తెలుసని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో దళితుడైన తన భూమిని బలవంతంగా లాక్కుని, పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి అక్రమ కేసులు పెట్టించిన చరిత్ర పుట్ట మధుదన్నారు. దళితుల భూములను బలవంతంగా లాక్కొని, ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా వారిని ఇబ్బందులు పెట్టింది కూడా పుట్ట మధునేనని ఆరోపించారు. ఇకపైన చిల్లర విమర్శలు చేస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిట్యాలలో తల్లిపాల వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలలో అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గొనగా, వారి బరువు, ఎత్తు కొలిచి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకున్నారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు, తల్లులు, పిల్లలతో ఆరు పద్ధతుల్లో చేతులు కడిగించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. అలాగే, ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు ఈ విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఐసీడీఎస్ విభాగాలకు చెందిన టీచర్లు అరుణ, కరుణ, మమత, రజిత, సరిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థుల నుండి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు.

# కాశీబుగ్గలో నన్నపునేని నరేందర్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యుడు నన్నపనేని నరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాశీబుగ్గ జంక్షన్‌లో వేడుకలు జరిగాయి. 19వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిలువేరు పవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి చేతుల మీదుగా భారీ కేక్ కట్ చేసి పండ్లను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో కంచ సంపత్, గోరంటల మనోహర్, 20వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, బూషిపాక రవి, పెండ్యాల సోను, బానోత్ కిరణ్ నాయక్, పుల్లా రమేష్, జక్కీ అశోక్, కలివేలు శేషు, వేముల జయ సాయి, దేవరకొండ చంద్రమోహన్, మంతెన అమ్రేష్, చిమ్మని గోపి, క్యాతం రంజిత్, బిల్లా శివ, చెన్నూరి కిషోర్, చిమ్మని శివ సంతోష్, చింత కింది రాజకుమార్, నోముల అభిలాష్, హరి శంకర్, జెక్కి యుగంధర్, నాసం హరీష్, భాగ్యలక్ష్మి, ఒంటెల కరుణ, దేవిక, శరత్, పులి చేరి సదానందం, తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీలు అమలు చేస్తున్నాం

■ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

■ నర్సంపేటలో రేషన్ కార్డుల పంపిణీ



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** నర్సంపేట నియోజకవర్గంలోని దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు. దుగ్గొండి మండలంలో మొత్తం 1,640 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. నల్లబెల్లి మండలంలో మొత్తం 1,241 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు మొత్తం 12,273 కొత్త రేషన్ కార్డులు అందించామని తెలిపారు. మరిన్ని కార్డులు ఆమోదం కోసం జిల్లా, రాష్ట్ర స్థాయిలో పరిశీలనలో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. రేషన్ కార్డులతో పాటు ఎన్నికల హామీ ప్రకారం సన్న బియ్యాన్ని కూడా పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కొన్ని ఆలస్యమైనా, ప్రజా ప్రభుత్వం వాటిని తప్పకుండా అమలు చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్స్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, ఇతర నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# సామాన్యులకు వరం ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** వైద్య ఖర్చులను భరించలేని సామాన్య ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఒక వరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఉడుగుల సురేష్ అన్నారు. జమ్మికుంటలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో, జన వికాస ఆధ్వర్యంలో ఇల్లంతకుంట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ, బాలవికాస సంస్థ తాను పదో తరగతిలో ప్రతిభ చూపినందుకు పది వేల రూపాయల రివార్డు, మెమొంటో అందించడాన్ని తన జీవితంలో మర్చిపోలేనని అన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులు ప్రబలే ఈ సీజన్‌లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇటలీలోని కేథలిక్ యూనివర్సిటీ ఆఫ్ మిలాన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఆల్బెర్టో, ఫ్రాన్సిస్కా ఈ శిబిరాన్ని సందర్శించారు. స్థానిక ప్రజల ఆహారపు అలవాట్లు, వైద్య సదుపాయాలు, సామాజిక-ఆర్థిక స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు. బాలవికాస సెంటర్ మేనేజర్ సులోచన మాట్లాడుతూ, ప్రతి మహిళా చైతన్యవంతురాలై తమ వంటగదిని వైద్యశాలగా మార్చాలని అన్నారు. మహిళల సాధికారతతోనే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బాలవికాస సీనియర్ అసోసియేట్ రమ మాట్లాడుతూ, హాస్పిటల్‌కు వెళ్ళలేని మారుమూల గ్రామాల ప్రజలు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు పెద్ది కుమార్, జన వికాస ఉచిత వైద్య శిబిరాల నిర్వహణను అభినందించారు. అనంతరం ఇటలీ విద్యార్థులను, వైద్యులను పెద్ది కుమార్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ ఆసియా, సంజీవని హాస్పిటల్ ప్రతినిధులు హరీష్, దేవేందర్, స్టాఫ్ మమత, అనురూప, అజిత్, మహేష్, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించిన ఘటన ఆత్మకూరు మండలంలోని అక్కంపేట గ్రామంలో జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అక్కంపేట గ్రామానికి చెందిన పెండ్లి సారంగం (55) గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. కొడుకు, కోడలితో కుటుంబ తగాదాల కారణంగా వారు వేరుగా ఉండటంతో ఆయన మానసిక వేదనకు గురయ్యారు. గత నెల 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సారంగం మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, దామెర :** సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటలను వాడటం వల్ల ప్రజలు తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని ఏఈఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం దామెర మండలంలోని పులుకుర్తి గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. పులుకుర్తి గ్రామాన్ని సేంద్రియ వ్యవసాయ గ్రామంగా ఎంపిక చేశామని, ఈ గ్రామంలో 125 మంది రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించామని రామకృష్ణ వివరించారు. రసాయనాలు వాడకుండా ఎలా సాగు చేయాలో, దాని వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే జీవామృతం ఎలా తయారు చేయాలో, దానిని ఎలా ఉపయోగించాలో రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో బొల్లం వేణుగోపాల్, కాసెట్టి లక్ష్మణ్, గోపు రమేష్, భిక్షపతి, సమ్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయండి



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్:** ప్రజా గాయకుడు, ప్రజాయుద్ధ నౌక గద్దర్ రెండవ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ పిలుపునిచ్చారు. ఈ నెల 8న హుజూరాబాద్‌లోని సిటీ కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఈ సభకు ప్రజలు, గద్దర్ అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. జమ్మికుంటలో విలేకరులతో మాట్లాడిన భరత్ గద్దర్ జీవితాన్ని తాడిత పీడిత ప్రజల కోసం అంకితం చేశారని, ఆయనకు ఘన నివాళులర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాసీం హాజరవుతారని తెలిపారు. వీరితో పాటు ప్రజా వాగ్గేయకారులు ఏపూరి సోమన్న, గర్జన, వడ్లకొండ అనిల్ కుమార్, వర్కాపురం రవికుమార్, ఢిల్లీతో పాటు స్థానిక కళాకారులు కూడా పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కళాకారులచే ఆటపాటల రూపంలో గద్దర్‌కు నివాళి కార్యక్రమం ఉంటుందని భరత్ వివరించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి సిటీ కన్వెన్షన్ హాల్ వరకు కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు, గాయకులు, మేధావులు, ప్రజా సంఘాల నేతలు, గద్దర్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని

## ఏబీవైఎం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొంగల చిన్నమల్లు యాదవ్



**వరంగల్ వాయిస్, వరంగల్:** అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొంగల చిన్నమల్లు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం లక్ష్మీపురంలోని పండ్ల మార్కెట్ సమీపంలో జిల్లా అధ్యక్షుడు బోల్లబోయిన కిషోర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరిబోయిన రాజయ్య యాదవ్ నూతన కమిటీని ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొంగల చిన్నమల్లు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా దేనబోయిన యాదవ్, ఉపాధ్యక్షులుగా రాజబోయిన కుమార్ యాదవ్, గడల రమేష్ యాదవ్, కందుల నరసయ్య యాదవ్, ఆంబోతు రాజు యాదవ్ ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శులుగా సాదం సునీల్ యాదవ్, బోల్లబోయిన వీరస్వామి యాదవ్, మాదరబోయిన యాదగిరి యాదవ్, వేల్పుల శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇల్లంద సెక్టార్‌లోని 4వ, 5వ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ప్రాజెక్టు అధికారి డొబోరా, ఇటీవల శిశువులకు జన్మనిచ్చిన తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. సూపర్వైజర్ కెడల చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మల్లెపాక భాగ్యలక్ష్మి, నేరెల్లి భారతి, ఆయా సుజాతతో పాటు తల్లులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒత్తిడి నిర్వహణపై అవగాహన



**వరంగల్ వాయిస్, మామునూర్:** నాలుగో బెటాలియన్ కమాండెంట్ బి. రామ్ ప్రకాష్ ఆదేశాల మేరకు, యాన్యువల్ రిఫ్రెషర్ కోర్సులో భాగంగా డి కంపెనీ అధికారులు, సిబ్బందికి ఒత్తిడి నిర్వహణపై బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సిస్టర్ చరిత మాట్లాడుతూ పోలీసులకు విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడి ఉంటుందని, దానిని అధిగమించడానికి యోగా, ధ్యానం సాధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రహ్మ కుమారీస్ ఇంచార్జి సిస్టర్ శ్రీలత, ఇతర సభ్యులు పోలీసు అధికారులు, సిబ్బందికి రాఖీ కట్టారు. అనంతరం ఆర్ఐ కార్తీక్ సిస్టర్ శ్రీలతను సత్కరించారు. ఆర్ఐ కార్తీక్, ఆర్ఎస్ఐలు లింగానాయక్, సుమిత్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై సదస్సు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కంకర బోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, పోక్సో చట్టం గురించి పిల్లలకు వివరించారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సునీత మాట్లాడుతూ నిర్బంధ విద్య, ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థను, బాల్య వివాహాలను నిర్మూలించాలని ఆమె విద్యార్థులతో నినాదాలు చేయించారు. సీనియర్ న్యాయవాదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ బీజేపీ పథకాలు



**వరంగల్ వాయిస్, దామెర:** కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్ రెడ్డి పిలుపునిచ్చారు. దామెర మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రాజ్ కుమార్ నిర్వహించిన 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేదల కోసం ముద్ర లోన్లు, ఎల్ఈడీ బల్బులు, వందే భారత్ రైళ్లు, ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు, యూనివర్సిటీలు, యూరియా ఫ్యాక్టరీల వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణకు వందల కోట్ల రూపాయల నిధులు విడుదలయ్యాయని, ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎక్కలదేవి రమేష్, పెంట రమేష్, వంగ నాగరాజు, బూత్ మాజీ అధ్యక్షులు సండేసారి సంతోష్ బాబు, ఎడ్ల కుమార్, మాదారపు సాంబయ్య, దామేరప్పుల చంద్రయ్య, గూడూరు రాజయ్య పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
మంగళవారం 05 ఆగస్టు 2025 7

# విశ్వంభరలో ఆషిక రంగనాథ్

## పోస్టర్ విడుదల



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న భారీ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ మూవీ 'విశ్వంభర'. యంగ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ డ్రామా, ఇప్పటివరకు వచ్చిన ప్రతి అప్డేట్‌తో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ నుంచి స్పెషల్ ట్రీట్ వచ్చింది.
ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఆషిక రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌కి వచ్చిన స్పందన చూస్తుంటే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. పోస్టర్ అదిరిపోయింది, ఆషిక కళ్ళలో మ్యాజిక్ ఉంది, విశ్వంభరకు మరో హైలైట్ ఆమె అవుతుందని ఫిక్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందాన్ని, క్యారెక్టర్ డెప్త్‌ను హైలైట్ చేస్తోంది. చిరు సరసన త్రిషతో పాటు–, సెకండ్ హీరోయిన్ ఈ కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ నటిస్తోంది. అంతే కాదు ఎం.ఎం.కీరవాణి అందిస్తున్న సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, రీసెంట్ గా 'హరి హర వీరమల్లు' వంటి సినిమాల్లో తన వర్క్‌కి ఇంటర్నేషనల్ గుర్తింపు తెచ్చుకున్న కీరవాణి.. ఇప్పుడు 'విశ్వంభర'కి సంగీతం అందిస్తుండటంతో మ్యూజిక్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.




# ఉస్తాద్‌లో పవన్ షెడ్యూల్ పూర్తి

### దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడి

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి దర్శకుడు గుడ్‌న్యూస్ చెప్పారు. ఈ సినిమాలో పవన్‌కు సంబంధించిన షెడ్యూల్ పూర్తయినట్లు– తెలుపుతూ ఓ ప్రత్యేక ఫొటో పంచుకున్నారు.






# పృథ్వీరాజ్‌ను వదిలి షారూఖ్‌కు అవార్డా

### జాతీయ చలనచిత్ర అవార్డులపై విమర్శలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల జాబితాలో ఉత్తమ నటుడి ఎంపికపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. 2023లో విడుదలైన సినిమాలకు గాను ఉత్తమ నటుడుగా బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్, ఉత్తమ సపోర్టింగ్ నటుడిగా విజయ రాఘవన్, బెస్ట్ సినిమాగా భగవంత్ కేసరి సినిమాలు అవార్డ్స్ అందుకున్నాయి. అలాగే వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విజేతలుగా ప్రకటించింది నేషనల్ అవార్డ్స్ జ్యూరీ. అయితే ఈ అవార్డ్స్ నేషనల్ జ్యూరీకి తలనొప్పులు తెచ్చింది. 2023 బెస్ట్ యాక్టర్ గా జావాన్ సినిమాకు గాను షారుక్‌కు ఈ అవార్డు ప్రకటించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అదే ఏడాదిలో మళయాళంలో పృథ్వి రాజ్ సుకుమారన్ హీరోగా ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో పృథ్వి రాజ్ నటనకు అవార్డు దక్కకపోవడంతో జ్యూరీపై విమర్శలు వచ్చాయి. వాస్తవంగా చూస్తే ఆడుజీవితంలో పృద్వి రాజ్ సుకుమారన్ నటన అద్భుతంగా ఉంటుంది. బ్రతుకు తెరువుకు దుబాయ్ వెళ్లిన ఓ సామాన్యుడు అక్కడ ఎడారిలో అనుభవించిన నరకం అనుభవించే క్యారక్టర్ లో పృద్వి రాజ్ అద్భుతంగా నటించాడు. ఇక జవాన్ సినిమాలో షారుక్ నటన గొప్పగా ఏమి ఉండదు. ఓ రొటీన్ రెగ్యులర్ కమర్షియాల్ సినిమాలో ఎలా ఉంటుందో అలా ఉంటుంది. ఈ విషయమై నేషనల్ జ్యూరీని ప్రశించగా జ్యూరీ సభ్యుడు ప్రదీప్ నాయర్ స్పందించారు. ఆడు జీవితంలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటన ఆర్టిఫిషయల్ గా ఉంటుంది. సహజత్వ లేదని జ్యూరీ ఛైర్‌పర్సన్ అశుతోష్ గోవారికర్ తో పాటు సహా జ్యూరీ సభ్యులు పలువురు భావించడంతో పృథ్వీరాజ్ కు అవార్డు దక్కలేదని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై నెటిజన్స్ ఫైర్ అవుతున్నారు. స్వప్రయోజనాల ముందు ఎంతటి అద్భుతమైన నటన కనబరించిన ఇలానే ఉంటుందని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# సినిమా ఫెయిల్యూర్‌కు రివ్యూలు కూడా ఓ కారణం

### హీరోయిన్ మృణాళ్ ఠాకూర్

ఏదైనా ఒక సినిమా వచ్చిందంటే చాలు.. యూట్యూబ్ రివ్యూల, ట్విట్టర్ కామెంట్స్, ఇన్‌స్టా రీల్స్‌తో మైండ్ బ్లాక్ అంటూ ఇష్టం వచ్చిన రివ్యూ ఇస్తున్నారు. అసలు సినిమా ఎలా ఉందో తెలిసేలోపే.. 'ఫ్లాప్', 'ఓవరాక్టింగ్', 'బోర్' అంటూ ట్యాగ్‌లతో దండం పెట్టి ప్రేక్షకుల అభిప్రాయాలను దారి తప్పిస్తున్నారు ఇటివల బాలీవుడ్ లో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' విడుదలైన మిశ్రమ స్పందన అందుకుంది. ఈ క్రమంలో మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ నిర్వహించారు. ఇందులో ఓ అభిమాని.. నేను నెగిటివ్ రివ్యూలు చూసి 'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమా చూడలేదు అంటూ కామెంట్ చేశాడు. దీనిపై ఆమె స్పందిస్తూ.. చాలా రివ్యూలు తప్పుదారి పట్టించేవిగా ఉంటున్నాయి. అందుకే రివ్యూలను నమ్మకుండా, మీరే సినిమా చూసి ఓ అభిప్రాయం ఏర్పరచుకోవాలి. ఒక్కోసారి సినిమా ఫెయిల్యూర్‌కి రివ్యూలే కారణం అవుతాయి అంటూ కుండ బద్దలు కొట్టేసింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





# కాళేశ్వరం తెలంగాణ జీవధార

- ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు వినయ్ భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్, ముఖ్యమంత్రి, మంత్రుల వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీష్ రావు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను హనుమకొండ జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో లైవ్ టెలికాస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ స్థానిక నేతలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, నీళ్లు, నిధులు, నియామకాలే అజెండాగా తెలంగాణ ఉద్యమం సాగిందని, 14 ఏళ్ల పోరాటం తర్వాత కేసీఆర్ తెలంగాణను సాధించారని అన్నారు. కోటి ఎకరాల మాగాణిగా రాష్ట్రాన్ని మార్చేందుకు కేసీఆర్ అనేక భారీ ప్రాజెక్టులు నిర్మించారని, దేశంలోనే అత్యంత వేగంగా కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలను తీర్చిందని వివరించారు. "జలయజ్ఞం" పేరుతో ధనయజ్ఞం చేసిన కాంగ్రెస్ పార్టీ, కాళేశ్వరం ప్రాజెక్టుపై అవినీతి మరకలు అంటించాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం అబద్ధం అని, కేవలం మూడు పిల్లర్లు మాత్రమే కుంగితే ప్రాజెక్టు మొత్తాన్ని బద్నాం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అసత్య ప్రచారాన్ని తిప్పికొడతామని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలను, 420 హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని వినయ్ భాస్కర్ అన్నారు. రోజుకో కమిషన్, విచారణల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే కేసీఆర్‌పై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, ఇది కక్షపూరిత రాజకీయం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజల మధ్యనే ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, సుధీర్ కుమార్, మర్రి యాదవ రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం ఆమె హసన్‌పర్తి మండలం పెంబర్తి, ఎల్కతుర్తి మండలం వీర నారాయణపూర్ గ్రామాల్లో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో మాట్లాడారు. నిర్మాణ పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఇల్లు మొదలుపెట్టనివారు, బేస్‌మెంట్ దశలో ఆగిపోయిన ఇళ్ల వివరాలను కూడా ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైలట్ గ్రామాలైన పెంబర్తి, వీర నారాయణపూర్‌లో ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టి ఆరు నెలలైనా పనులు నెమ్మదిగా సాగడం సరికాదని అన్నారు. ప్రభుత్వం ఇళ్లకు రూ. 5 లక్షల నిధులు మంజూరు చేస్తోందని, వివిధ దశల్లో నిధులు అందిస్తున్నందున లబ్ధిదారులు పనులు వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

### ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు..

బేస్‌మెంట్ దశలో ఉన్న ఇళ్లను వెంటనే ముందుకు తీసుకెళ్లాలని, లేదంటే తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నిర్మాణాలు నిలిచిపోతే వాటిని రద్దు చేసి, తదుపరి జాబితాలోని అర్హులకు ఇళ్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, ఎల్కతుర్తి తహసీల్దార్ ప్రసాద్ రావు, ఎంపీడీవో రవి, ఇతర అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ అమలెప్పుడూ ?

- పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ కడియం కావ్య
- భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలి

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ:** వరంగల్ జిల్లాలోని రైతుల భూ రికార్డులను డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఆధారంగా రూపొందించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో కేంద్రాన్ని కోరారు. దీనివల్ల రైతులు మోసపోకుండా ఉంటారని, సబ్సిడీలు నేరుగా అర్హులైన వారికి చేరుతాయని ఆమె వివరించారు. ఎంపీ ప్రశ్నలు, కేంద్ర మంత్రి సమాధానం ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య "తెలంగాణలో ఏమైనా పైలట్ ప్రాజెక్టులు ఉన్నాయా? బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని ఎప్పుడు అమలు చేస్తారు?" అని కేంద్రాన్ని ప్రశ్నించారు. దీనికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా "డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మాడర్నైజేషన్ ప్రోగ్రాం (DILRMP)" ప్రస్తుతం అమలులో ఉందని, అయితే బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఈ ప్రోగ్రామ్‌లో భాగం కానందున, అది ఎప్పుడు అమలులోకి వస్తుందో ప్రస్తుతం చెప్పలేమని తెలిపారు. ఈ అంశంపై ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ అమలుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ పద్ధతి ద్వారా భూ రికార్డులను నకిలీ చేయలేరని, ఎలాంటి మోసాలు లేకుండా రైతులకు సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ పథకాలు సజావుగా అందుతాయని ఆమె స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఈ ఆధునిక సాంకేతికతను అమలు చేయడంపై కేంద్ర ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# చెత్త తరలింపు వాహనాలు ఐసీసీసీకి అనుసంధానం చేయాలి

## బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

**వరంగల్ వాయిస్, వరంగల్:** చెత్త తరలింపు వాహనాల సమాచారాన్ని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) కు అనుసంధానం చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శానిటేషన్‌కు సంబంధించిన స్వచ్ఛ ఆటోలు, చెత్త ట్రాక్టర్లు, జేసీబీలు, టిప్పర్లను ఐసీసీసీకి అనుసంధానించాలని చెప్పారు. వాహనాలు పనిచేస్తున్నాయా లేదా, ఆగిపోతే కారణం ఏమిటనే వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. ద్వితీయ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లలోని పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు కేటాయించిన వాహనాలకు ప్రత్యేక గుర్తింపు నంబర్లు కేటాయించి, వాటిని యాప్ ద్వారా ట్రాక్ చేయాలి. ఐసీసీసీ సిబ్బంది 24/7 అందుబాటులో ఉండి, అలారం సిస్టమ్‌ను పనిచేసేలా చూడాలి. మూడు వాట్ల సామర్థ్యం గల కాంపాక్టర్లను పునరుద్ధరించాలి. అదనంగా ఉన్న జవాన్లతో టీమ్‌లను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఉపయోగించాలని సీఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఐటీ మేనేజర్ రమేష్, ఐసీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన తౌటం ఝాన్సీరాణి రవీందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మంగళవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద దేశరాజుపల్లిలో తుది దశకు చేరుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సముద్రాల కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ మిట్టపల్లి సుభాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సముద్రాల ఇస్తారి, పోతనవేన రాజకుమార్, ఈజ్జిగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- కమిషనర్ ను కాలనీకి ఆహ్వానించిన మాజీ కౌన్సిలర్
- 9వ వార్డులో సమస్యల పరిష్కారానికి వినతి

**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల పురపాలక సంఘం 9వ వార్డు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి విజ్ఞప్తి మేరకు పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు మంగళవారం వార్డులో పర్యటించారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ఆయన అధికారులతో కలిసి శ్రీనివాస కాలనీని



సందర్శించారు. మాజీ కౌన్సిలర్ పూర్ణ చారి ఆధ్వర్యంలో పర్యటించిన కమిషనర్‌తో కాలనీవాసులు తమ సమస్యలను వెల్లడించారు. డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితి వల్ల వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇళ్లలోంచి బయటకు కాలు పెట్టలేని పరిస్థితి ఉందని వాపోయారు. ప్రజలను ఆదుకోవాలని వార్డు ప్రజల తరపున ఆయన కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com